

# టాగోర్ కథలు

తెలుగు సేత: చంద్రలత



## అమ్మా, సెలవలొచ్చాయి!    రవీంద్రనాథ టాగోర్

### ఛుట్టీ (బెంగాలీ, 1892/93)



ఫతిక్ చక్రవర్తి తమ పల్లెపిల్లల రామదండుకి నాయకుడు. ఆ పూట ఒక కొత్త తుంటరి ఆలోచన ఫతిక్ మనసులో మెదిలింది. ఒక పెద్ద కొయ్యదుంగ నది అడుగున బురదలో కూరుకుపోయి ఉంది. దానిని పడవలాగా మారిస్తే భలే అనువుగా ఉంటుంది. నది ఒడిలో నుంచి దానిని పక్కకి పొర్లించి, ఒడ్డు మీదికి దొర్లించాలి. ఆ కొయ్యదుంగ యజమాని గొల్లుమంటాడు, ఆశ్చర్యపోతాడు. ఆ పై విషయాలు తెలిసి గయ్యిమంటాడు. తమ అల్లరిపని ఫలించినందుకు పిల్లలందరూ పకపకలాడతారు.

అందరూ సరేనంటే సరేనన్నారు. వెంటనే ఆ ఘనకార్యం చేయడానికి కలిసికట్టుగా నడుం బిగించారు. సరదా మొదలవ్వబోతుంటే, ఎక్కడి నుంచి ఊడిపడ్డాడో మఖన్, ఫతిక్ చక్రవర్తి తమ్ముడు, తీరికగా నడుచుకొంటూ వచ్చాడు. ఒక్క మాటన్నా మాట్లాడకుండా, తిన్నగా వెళ్లి ఆ కొయ్యదుంగ మీద బైఠాయించాడు. పిల్లలు కాసేపు అయోమయంలో పడ్డారు.

ఒక అబ్బాయి నెమ్మదిగా వెళ్లి, మఖన్‌ని మెల్లిగా నెట్టాడు. ఇంకో అబ్బాయి మఖన్ దగ్గరకు వెళ్లి, కొయ్యదుంగ మీదనుంచి పైకి లెమ్మని మర్యాదగా చెప్పాడు. కానీ, తమ్ముడేమీ పట్టించుకోనట్టు కదలలేదు, మెదలలేదు. అప్పుడు అతను ఆటల నుంచి వైరాగ్యం పొందిన చిన్న తాత్వికుడిలా కనబడ్డాడు.

ఫతిక్ కి ఒళ్ళు మండింది.

"మఖన్!" ఫతిక్ అరిచాడు."ఈ క్షణం నువ్వక్కడి నుంచి దిగకపోతే, నేను నిన్ను బాదడం ఖాయం!"



మఖన్ ఆ కొయ్యదుంగ మీద మరింత అనుకూలంగా ఉన్నచోటుకి కుదురుకున్నాడు.

అప్పుడు ఫతిక్ తన ప్రజానీకం ముందు తన రాజదర్పాన్ని నిలబెట్టుకోవాలి కదా. అతని మాట నిలబెట్టుకొనేటట్లే ఉన్నాడు. ఫతిక్ చురుకైన బుర్ర చకచకా ఒక యుక్తిని పన్నింది. అది అతని తమ్ముడికి అసౌకర్యాన్ని, అతని అభిమానులకు బోలెడంత ఉల్లాసాన్ని ఇస్తుంది.

అంతే! ఆ కొయ్యదుంగని మఖన్ తో సహా దొర్లించమని ఫతిక్ ఆజ్ఞాపించేసాడు.

మఖన్ చెవిలో ఈ మాటపడినా, పట్టించుకోకుండా ఉండిపోయాడు. కనబడే సత్యాన్ని మఖన్ చూడలేకపోయాడు. ఎలాగంటే, ఈ భూలోకంలోని కీర్తి మీదే శ్రద్ధ పెడతారే, వారు ఆ కీర్తి ధ్యాసలో పడి, దానిలో దాగి ఉన్న ప్రమాదాన్ని ఊహించలేరు. మఖన్ కూడా అచ్చంగా అలాగే, తన కీర్తి ధ్యాసలో తాను మునిగిఉన్నాడు.

అంతలోనే, పిల్లలు ఆ కొయ్యదుంగని వారి శక్తి కొద్దీ అటూఇటూ నెట్టడం మొదలెట్టారు. బిగ్గరగా దరువేస్తూ తోస్తున్నారు, "ఒకటి.. రెండు.. మూడు... పద పద.... పద..."

'పద' అన్న మాట వినగానే, ఆ పదం వెన్నంటే ఆ కొయ్యదుంగా నదిలోకి వెళ్లిపోయింది. దానితో బాటే, మఖన్ తాత్వికత, కీర్తి అన్నీ దూసుకుపోయాయి.

మిగిలిన పిల్లలందరూ తమ గొంతులు బొంగురుపోయే లాగా ఆనందంతో కేరింతలు కొట్టారు. కానీ, ఫతిక్ కొంచెం భయపడ్డాడు. జరగబోయేదేమిటో ఫతిక్ కి తెలుసు.

మఖన్ భూమితల్లి ఒడిలో నుంచి ఒక గుడ్డివాడు లేచినట్లు లేచివచ్చాడు. ఉగ్ర నరసింహుడిలా పెడబొబ్బలు పెడుతూ ఫతిక్ మీదికి లంఘించాడు. ఫతిక్ ముఖాన్ని రక్కాడు. పిడిగుద్దులు కురిపించాడు. అందిన చోటల్లా ఎగెరెగిరి ఫతిక్ ని తన్నాడు. ఆ తరువాత, మఖన్ ఏడ్చుకొంటూ ఇంటికి పరిగెత్తాడు. నాటకంలో మొదటి అంకం పూర్తయింది.

ఫతిక్ ముఖం తుడుచుకొన్నాడు. నది ఒడ్డున ఇసుకలో కూరుకుపోయిన ఓ నాటుపడవ అంచున చతికిలబడ్డాడు. ఇంతలో, ఓ పడవ ఓ నడివయస్కుడిని తెచ్చి ఒడ్డున దింపింది. అతను మెల్లిగా ఒడ్డు మీదకి దిగాడు. అతని తల నెరిసిపోయింది.కానీ, మీసాలు నల్లగా మెరిసిపోతున్నాయి. పనీపాటా లేని ఈ పిల్లవాడు అతని కంట్లో పడ్డాడు. పిల్లవాడిని అడిగాడు, "చక్రవర్తులు ఎక్కడ ఉంటారో తెలుసా?" అని.

ఫతిక్ గడ్డిపరకను నములుతూ అన్నాడు, "అదుగో.. అక్కడే!" కానీ, అతను ఎటు వైపు చూపించాడో ఎవరం చెప్పలేము. ఎవరికీ తెలియదు. ఆ కొత్తవ్యక్తి మళ్ళీ అడిగాడు. ఫతిక్ ఆ పడవ మీద అటు ఇటూ ఊగిసలాడుతూ అన్నాడు, "వెళ్ళు! తెలుసుకో!" ఆ మాట అని నోట్లో గడ్డిపరకని మళ్ళీ నమలడం మొదలెట్టాడు.

అప్పుడే ఫతిక్ వాళ్ళ ఇంటి నుంచి ఒక సేవకుడు వచ్చాడు. ఫతిక్ ను వాళ్ళమ్మ పిలుస్తుందని చెప్పాడు. ఆ సేవకుడే ఆ సందర్భానికి యజమాని. ఫతిక్ ను ఒడిసి పట్టుకొని, భుజానికెత్తుకొన్నాడు. తంతూ కొడుతూ లాక్కెళ్ళాడు. పట్టరాని బలంతో గింజుకొంటూ, మొండిగా హఠం వేస్తున్న ఫతిక్ ని తన వెంట బెట్టుకెళ్ళాడు.

ఫతిక్ ఇంటికి చేరీచేరగానే, వాళ్ళమ్మ కోపంగా అడిగింది, "అయితే, మళ్ళీ మఖన్ ని కొట్టావన్నమాట!"

ఫతిక్ తలబిరుసుగా అన్నాడు, "లేదు! ఎవరు చెప్పారమ్మా నీకు?"

తల్లి మరింత బిగ్గరగా అరిచింది, "అబద్ధమాడొద్దు! నువ్వు కొట్టావ్!"

ఫతిక్ గునుస్తూ అన్నాడు, "నేను చెప్తున్నానుగా అమ్మా, నేను కొట్టలేదు.కావాలంటే మఖన్ నే అడుగు!" కానీ, ఇంతకు మునుపు తల్లికి చెప్పిన పితూరీ మాటలకు మఖన్ కట్టుబడి ఉండాలనుకొన్నాడు. మఖన్ ఏ మాత్రం తడుముకోకుండా అన్నాడు, "అవునమ్మా, ఫతిక్ నన్ను కొట్టాడు!"

ఫతిక్ సహనం అప్పటికి నశించింది. ఈ అన్యాయాన్ని సహించలేకపోయాడు. మఖన్ వైపు దూసుకెళ్ళి, దబీదబీ పిడిగుద్దుల వర్షం కురిపించాడు. "ఇవన్నీ తీసుకో!", ఫతిక్ అరిచాడు, "ఇదీ... ఇదీ... అబద్ధాలు చెప్పినందుకు!" అతని తల్లి ఆ క్షణాన మఖన్ పక్షాన చేరింది. ఫతిక్ ను తన రెండు చేతులతో ఎడాపెడా బాదేసింది. ఆ దెబ్బలు తప్పించుకోవడానికి కాపు కాసుకోబోతూ, ఫతిక్ ఆమెను పక్కకు నెట్టేసరికి, ఆమె మరింతగా బిగ్గరగా అరిచింది, "ఏంట్రా పిల్ల పిశాచీ... దుర్మార్గుడా! నీ కన్నతల్లినే కొడతావా?"

ఆ సంక్షోభ సందర్భంలో, ఏటి ఒడ్డున కనబడిన ఆ తలనెరిసిన ఆగంతక పెద్దమనిషి అక్కడికి చేరుకొన్నాడు. విషయం ఏమిటని ఆరాతీసాడు. ఫతిక్ కి మొహం చెల్లలేదు.సిగ్గుపడ్డాడు. కానీ, కొత్త గొంతు మాట చెవినబడగానే,వెనకడుగు వేసిన ఫతిక్ వాళ్ళమ్మ కోపం కాస్తా ఆశ్చర్యంగా మారింది.ఆమె అన్నను గుర్తుబట్టింది.ఒక్కసారిగా గొల్లుమన్నది. "ఏంటిది, అన్నయ్య. ఎక్కడి నుంచి వచ్చావు?"ఆ మాటలు అంటూనే,ఫతిక్ వాళ్ళమ్మ వంగి అతని పాదాలను స్పృశించింది.

ఆ వచ్చిన అపరిచితవ్యక్తి స్వయాన ఫతిక్ వాళ్ళమ్మకు తోడబుట్టిన అన్నయ్య, విశ్వంభర. ఫతిక్ వాళ్ళ మేనమామ. ఫతిక్ వాళ్ళమ్మ పెళ్లయ్యాక, విశ్వంభర ఎటో దేశాంతరం వెళ్ళిపోయాడు. బొంబాయి చేరుకొని, వ్యాపారం చేసుకొంటున్నాడు. విశ్వంభర బొంబాయిలో ఉన్నప్పుడే, ఆమె తన భర్తను కోల్పోయింది.

విశ్వంభర ఇప్పుడు కలకత్తాకి తిరిగి వచ్చేసాడు. వచ్చీరాగానే చెల్లెలి గురించి ఆరా తీసాడు. ఎక్కడ ఉందో తెలిసీ తెలియగానే, చెల్లెలిని వెతుక్కుంటూ ఉరుకులు పరుగులమీద వచ్చేశాడు.

ఆ తరువాతి కొన్ని రోజులు సరదాగా గడిచాయి. విశ్వంభర పిల్లలిద్దరి చదువుసంధ్యల గురించి ఆరాతీశాడు. తన మేనల్లుడు ఫతిక్ ఒక పనికిరాని కొయ్య, అందరికీ తలనొప్పి అని విశ్వంభరకి తెలిసింది. ఫతిక్ బద్ధకస్తుడు, అవిధేయుడు,

అల్లరి చిల్లర పిల్లవాడు అని తెలుసుకొన్నాడు. కానీ, మఖన్ బంగారమంత మంచివాడు, మేకపిల్లంత సాత్వికుడు. పైనుంచి, మఖన్ కి చదువంటే చాలా ఇష్టం... అని కూడా తెలుసుకొన్నాడు.

విశ్వంభర చాలా ఉదారంగా ఒక ప్రతిపాదన చేశాడు. ఫతిక్ బాధ్యతను చెల్లెలి నుంచి తాను తీసుకొని, తన పిల్లలతో సమానంగా చదివిస్తానని. "కలకత్తా కి వస్తావా?" అని మేనమామ అడిగినపుడు, ఫతిక్ సంతోషానికి హద్దులు లేవు. టక్కున బదులిచ్చాడు, "అలాగే మామయ్యా!"

ఒక రకంగా, ఆ అంగీకారానికి ఎంతో స్పష్టత ఉంది.

ఫతిక్ ను వదిలించుకోవడం వాళ్లమ్మకి ఎంతో ఉపశమనాన్ని ఇచ్చింది.ఆమెకి ఆ అబ్బాయి మీద కొంత వివక్ష ఉన్నది.అన్నాదమ్ముల మధ్య ప్రేమ లేదు.ఏదో ఒక రోజు మఖన్ ని నదిలో ముంచేస్తాడో,గొడవలో పడి మఖన్ తల పగలగొడతాడేమోనని, లేదా ఏదైనా ప్రమాదంలో పడేస్తాడేమోనని, నిత్యం ఆమె భయపడుతూనే ఉండేది. అదే సమయాన తమకి దూరంగా కలకత్తాకి వెళ్ళడానికి ఫతిక్ చూపుతున్న పరమ ఉత్సాహానికి ఆమెకు చిర్రెత్తుకొస్తోంది.
అన్నీ సర్దుకొన్నాక, ఫతిక్ వాళ్ళ మామయ్యను అడిగినవాడు అడిగినట్లే ఉన్నాడు. “కలకత్తా ఎప్పుడెళదాం?” అని. ఆ ఉత్సాహంలో పడి, ముళ్ళమీద కూర్చున్నట్లుగా, ఫతిక్ పగలంతా ఎక్కడా కుదురుగా ఉండ లేకపోతున్నాడు. ఉద్వేగంతో రాత్రిళ్ళు దాదాపుగా నిద్రపట్టక మెలుకువగా గడుపుతున్నాడు.

తన వారసత్వంగా ఎంతో పద్ధతిగా, అతని చేపలు పట్టే చువ్వని, అతని పెద్ద గాలిపటాన్ని, అతని గోళీకాయలను ఫతిక్ ఇచ్చేశాడు. నిజానికి కలకత్తా వెళ్ళబోయే ముందు, అతని తమ్ముడు మఖన్ తో ఫతిక్ చూపిన ఉదారతకు హద్దులే లేవు.

కలకత్తా వెళ్ళాక ఫతిక్ అత్తను మొదటిసారి కలిశాడు. ఆమె ఏ విధంగా చూసినా అతనొక అదనపు భారం అని బలీయంగా అనుకొంది. ఆమె తన ముగ్గురు కొడుకులను పెంచడానికే ఆమె తబ్బిబ్బవుతోంది. మరొకరి అదనపు బాధ్యతను ఆమె తట్టుకోలేక పోతోంది. అందులోనూ ఆ ముగ్గురి మధ్యలో పద్నాలుగేళ్ల పల్లెటూరి పిల్లవాడు వచ్చి చేరడం, ఆమెకు అసలే గిట్టడం లేదు. చెల్లెలికి అలాంటి మాట ఇచ్చే ముందు, విశ్వంభర ఒకటికి రెండుసార్లు ఆలోచించ వలసింది. మానవ సంబంధాలలో పద్నాలుగేళ్ళ అబ్బాయి పెంపకాన్ని మించిన తలనొప్పి పని, చీకాకువ్యవహారం మరొకటి ఉండదు. అన్నిటికీ అతనికి అడ్డం పడుతూనే ఉన్నారు. చిన్నపిల్లవాడిలా మాట్లాడబోతే, పసిబాలకుడివా అని వెక్కిరిస్తారు. ఎదిగినవాడిలాగా ఏదైనా ఎదురు సమాధానం చెబితే, పెద్దవాళ్ళను గౌరవించడం లేదంటారు. నిజానికి ఫతిక్ ఏ వేళలో ఏమి మాట్లాడినా ఖండిస్తారు.

దానికి తోడు అతను ఎదిగీ ఎదగని అనాకర్షక వయస్సులో ఉన్నాడు. అతని దుస్తులకన్నా ఊహించనంత వేగంగా ఎదిగిపోతున్నాడు. అతని గొంతు బొంగురుపోతోంది. మాటలు విరిచినట్లవుతున్నాయి, గురగురలాడుతున్నాయి. అతని ముఖం పీక్కుపోయి, సాగి, చూడలేనట్లుగా తయారవుతోంది.

పిల్లల చిన్నప్పుడు వారి పొరపాట్లను ఇట్టే క్షమించేస్తాం. కానీ, ఓ పద్నాలుగేళ్ళ పిల్లవాడి తెలిసీతెలియని మాటలు చేతలలోని ఖాళీలను అసలు తట్టుకోలేం. బాధాకరమైన విషయం ఏమిటంటే, ఆ అబ్బాయి కూడా ఎంతో వ్యధకు గురవుతాడు. ఆత్మస్పృహ పెరుగుతుంది. పెద్దవాళ్ళతో మాట్లాడేటప్పుడు ఎంతో ముందు కన్నా వెళతాడు, లేదా అనవసరపు సిగ్గుతో తలవంచుకొని పక్కకు వెళతాడు. తన ఉనికి పట్ల తానే సిగ్గుపడతాడు.

సరిగ్గా ఈ వయసులోనే, ఆ చిన్నవాడి మనసు లోలోపల ఒక గుర్తింపుకోసం తపిస్తుంటాడు. ప్రేమ కోసం పరితపిస్తుంటాడు. ఎవరైనా ఏ కొద్దిగా ఆదరించినా, వారికి బానిసలా మారిపోతాడు. కానీ, ఎవరూ అతనికి బాహాటంగా ప్రేమని చూపలేదు. గారాబం చేస్తే పిల్లవాడికి కీడని భావించే వారు.

పై నుంచి, చీటికిమాటకి చివాట్లు ఎత్తిపొడుపులతో, యజమానిని కోల్పోయి, ఫతిక్ తననితాను ఓ వీధిన పడ్డ కుక్కలా భావించుకోసాగాడు. ఓ పద్నాలుగేళ్ళ పిల్లవాడికి తన ఇల్లే స్వర్గసీమ. కొత్త ఇంట్లో కొత్తవారితో కలిసి ఉండడం సబబు కాదు, అదొక చిత్రహింస. అలాగే, ఆ ఇంటిలోని ఆడవారిలో దయగల అమ్మల కరుణభరితమైన చల్లని చూపుల్లోనే ఆ కిశోరవయస్కుడికి ఆనందం, అంతేగానీ వారి చిన్నచూపులో కాదు.

ప్రతి సందర్భంలోనూ, కారుణ్యంలేని ఆ మహిళ చూసే చిన్నచూపుతో, పిలవని చుట్టంలా ఫతిక్ లో వచ్చి చేరిన ఆందోళన మరింత జటిలమైనది. ఎప్పుడైనా ఆమె తనకోసం ఏదైనా పని చేయమంటే, ఫతిక్ పరమానందంగా ఆ పనిని తలకెత్తుకొనేవాడు. ఆ ఆనందంలో శృతిమించి, మితిమీరిపనిచేసేవాడు. అప్పుడామె, "అంత తెలివితక్కువగా పని చేయవద్దు. పాఠాలమీద శ్రద్ధపెట్టు," అనేది.

నిరాదరణకు తోడు, క్రిక్కిరిసిన ఆ ఇంట్లో ఫతిక్ ఊపిరి తీసుకోలేనంతగా ఉక్కిరిబిక్కిరయ్యాడు. ఎక్కడో బయలు ప్రదేశాల్లోకి వెళ్ళి, గుండెలనిండా ఊపిరి పీల్చుకోవాలనుకొనే వాడు. కానీ, ఆ ఇరుగుపొరుగున ఎక్కడా బయలు ప్రదేశాలే లేవు.

కలకత్తాలోని గోడలు, ఇళ్ళల్లోని ఇరుకుదనంలో చిక్కుకుపోయి, ప్రతిరాత్రి తమ పల్లెలోని తన ఇంటిని కలగనేవాడు. అతనికి పచ్చినబయళ్ళలో పరుగులు పెడుతూ, గాలిపటాలు ఎగరవేయడం గుర్తుకువచ్చేది. విశాలమైన నదివొడ్డుమీద, పాటలు పాడుతూ ఆనందంగా కేరింతలు కొడుతూ, రోజంతా గెంతులు వేయడం గుర్తుకువచ్చేది. ఎప్పుడుపడితే అప్పుడు సన్నని వాగులోకి ఎగిరి దూకడం, నదిలో ఈతలు కొట్టడం గుర్తొచ్చేవి.

తమ పల్లెపిల్లల రామదండు నాయకుడిలా తన ఘనకార్యాలు, పెత్తనాలు గుర్తొచ్చేవి. అన్నిటికీ మించి, అతనంటే వివక్ష చూపే అతని గయ్యాళి తల్లి జ్ఞాపకాలతో రేయింబవళ్ళు గడిచిపోయేవి.

జీవరాశులన్నిటిలోనూ కనబడే ఆ భౌతిక ప్రేమ, ప్రేమించే వారికి దగ్గరగా ఉండాలన్న ఆ సహజవాంఛ, అవ్యక్తమైన అనుభూతులన్నీ మూట గట్టుకొన్న దూరపు ఎడబాటు దుఃఖం——అమ్మ కోసం లోలోపల గూడు కట్టుకొన్న నిశ్శబ్ద శోకం. అదంతా అచ్చంగా సంధ్యవేళలో కన్నతల్లి దొక్కలో దూరే లేగదూడ లాంటి ప్రేమ, ఒక జీవ స్పృహ. ఆ ప్రేమ అలజడిగా,

సిగ్గుగా, వణుకుగా ఆ బక్కపలచని, బట్టలైనా సరిగ్గా లేని అనాకారి పిల్లవాడి గుండెలనిండా నిండి ఉంది. ఎవరికీ అర్థం కాలేదు కానీ, అతని మనసును ఎరవేసినది అతని కన్నతల్లి ఎడబాటు దుఃఖమే.

ఫతిక్ కన్నా వెనకబడిన పిల్లవాడు ఆ బడి మొత్తంలో లేడు. పంతులు ఏదైనా ప్రశ్న అడిగితే, జవాబుగా ఫతిక్ వీపుమీదపడే పిడిగుద్దులన్నిటినీ ఓ అడ్డగాడిదలా భరించేవాడు. తోటిపిల్లలందరూ ఆడుకోవడానికి పరుగులు పెడితే, ఒంటరిగా కిటికీ పక్కన కూర్చుని, దూరాన ఉన్న ఇళ్ళ కప్పులను చూసేవాడు. ఎవరైనా పిల్లలు ఆ ఇళ్ళ కప్పుల మీదకు ఎక్కి ఆడుకొంటుంటే, ఫతిక్ మనసు బాధగా మూలిగేది.

ఒకరోజున తన ధైర్యాన్నంతా కూడదీసుకొని మామను అడిగాడు, "మావయ్యా, నేను మా ఇంటికి ఎప్పుడు వెళతాను?"

అతని మామయ్య అన్నాడు, "సెలవలు వచ్చేదాకా ఆగాలి మరి!"

సెలవులు అక్టోబర్ లో గానీ రావు. అందుకు చాలాకాలం వేచి ఉండాలి.

ఒక రోజు ఫతిక్ తన పాఠ్యపుస్తకం పోగొట్టుకొన్నాడు. వాచకాలు ఉంటేనే చదవడం కష్టం, ఇక ఇప్పుడు చదువు అసాధ్యమైపోయింది. రోజు తరువాత రోజు, అతని ఉపాధ్యాయుడు నిర్దాక్షిణ్యంగా ఫతిక్ కు బడితపూజ చేసేవాడు. ఫతిక్ పరిస్థితి ఎంత దారుణంగా దిగజారిందంటే, అతని మేనమామ కొడుకులు వారి బంధుత్వాన్ని చెప్పుకోవడానికి ఇష్టపడక, బడిలో అతనినొక అపరిచిత పరాయివ్యక్తిని చేసేసారు. మిగిలిన పిల్లలకన్నా వీళ్ళే ఎక్కువగా హేళన చేసేవారు, మాటలతో చేతలతో వేధించేవారు.

చివరికోనాడు ధైర్యం పుంజుకొని, ఫతిక్ వాళ్ళ అత్తతో చెప్పాడు——తన పుస్తకం పోయిందని. వాళ్ళ అత్త కోపంతో పెదాలు బిగించి అంది, "పనికిరాని వెధవా.. నెలకు అయిదుసార్లు పుస్తకాలు కొని, పోషించాలా నిన్ను?"

ఆ రోజు రాత్రి, బడి నుంచి తిరిగి వస్తుంటే, ఫతిక్ కి తీవ్రమైన తలనొప్పి వచ్చింది. దానితో బాటే విపరీతమైన వణుకు. ఫతిక్ కి తనకు మలేరియా జ్వరం రాబోతుందని అర్థమయింది.పైనుంచి, జబ్బున పడితే అత్తకు తను ఒక భారం అవుతాడని ఫతిక్ భయం.

ఆ మరునాడు పొద్దున, ఫతిక్ ఎక్కడా కనబడలేదు.ఇరుగుపొరుగున ఎంత వెతికినా లాభం లేదు. రాత్రంతా ఎడతెరపిలేకుండా వానపడింది. పిల్లవాడిని వెతకడానికి వెళ్ళినవాళ్ళంతా తడిచి ముద్దయి తిరిగివచ్చారు. చివరికి, విశ్వంభర పోలీసుల సాయం తీసుకొన్నాడు.

సాయంకాలం పోలీసువ్యాను వచ్చి, విశ్వంభర ఇంటి ముందు ఆగింది. ఇద్దరు పోలీసు కానిస్టేబుళ్ళు ఫతిక్ ను తమ చేతుల మీద వేసుకువచ్చి, విశ్వంభర ముందు దింపారు. ఫతిక్ తల నుంచి కొనగోటి దాకా తడిచి ముద్దయి ఉన్నాడు. వళ్ళంతా బురద.కళ్ళు కణకణలాడుతోన్న నిప్పుల్లా ఉన్నాయి.ముఖం కళ్ళు జ్వరంతో ఎర్రబడి ఉన్నాయి. వళ్ళంతా వేడితో వణికిపోతోంది.

విశ్వంభర ఫతిక్ ను తన చేతుల్లోకి ఎత్తుకొని,ఇంటి లోపలకు తీసుకెళ్ళాడు. ఫతిక్ ను అలా చూడగానే,విశ్వంభర భార్య బిగ్గరగా అంది,"మనకు ఎన్ని తిప్పలు తెచ్చిపెట్టాడు ఈ పిల్లాడు! ఇంటికి తిప్పి పంపితే సరి!"

ఫతిక్ ఆమె మాటలు వినగానే, వెక్కిళ్ళు పెడుతూ అన్నాడు,"మావయ్యా, నేను ఇంటికే తిరిగి వెళుతున్నాను. వాళ్ళే నన్ను ఇక్కడికి లాక్కొని వచ్చారు."

ఫతిక్ జ్వరం పెరిగిపోయింది.రాత్రంతా ఒకటే కలవరింతలు.విశ్వంభర డాక్టర్ ను తీసుకువచ్చాడు.ఫతిక్ కళ్ళు తెరిచి చూసాడు.జ్వరంతో ముఖం ఎర్రబడ్డది.వళ్ళు పేలిపోతోంది.ఇంటి పైకప్పు శూన్యంలోకి చూస్తూ,ఫతిక్ దీనంగా అడిగాడు, “మావయ్యా, ఇంకా సెలవలు రాలేదా?”

విశ్వంభర ఉబికివస్తోన్న కన్నీటిని తుడుచుకొంటూ,ఆ జ్వరంతో పేలిపోతున్న బక్కచిక్కిన చిన్నవాడి చేతిని తన చేతుల్లోకి తీసుకొన్నాడు.రాత్రంతా ఒకటే కలవరింతలు, జ్వరప్రేలాపనలు.ఆ పిల్లవాడు మళ్ళీ గొణిగాడు.అతని గొంతు పెరిగింది. "అమ్మా!" ఫతిక్ ఏడుస్తూ అరిచాడు,"నన్నట్లా కొట్టొద్దమ్మా.. నేను నిజమే చెబుతున్నా!"

ఆ మరుసటి రోజు ఫతిక్ కు కాసేపు స్పృహ వచ్చింది. గదంతా కలియచూశాడు, ఎవరి కోసమో వెతుక్కున్నట్లుగా. వెతికి వేసారి, అతని తల దిండులోకి కూరుకుపోయింది.గోడవైపు తిరిగి గట్టిగా నిట్టూర్చాడు.

విశ్వంభర ఫతిక్ ఏమి ఆలోచిస్తున్నాడో తెలుసు. మెల్లిగా మేనల్లుడి తలమీదకు వంగి అన్నాడు,"ఫతిక్, అమ్మ కోసం కబురు పెట్టాను."

ఆ రోజు గడిచింది. డాక్టర్ ఆందోళన నిండిన స్వరంతో, ఆ పిల్లవాడి పరిస్థితి బాగా దిగజారిందని అన్నాడు. ఫతిక్ అరవడం మొదలెట్టాడు.

"అద్దిరబన్న.. మూడు బారలు
అదిగోరన్నా... నాలుగు బారలు
అద్దిరబన్న..."

స్టీమరు మీది నావికుడెవ్వరో నది నుంచి సముద్ర దూరాన్ని గెడబారున కొలుస్తూ అరవడం ఫతిక్ లోగడ విన్నాడు.ఇప్పుడు అతనే భవసాగరపు అగాధాలను కొలుస్తున్నాడు.

ఆ రోజు గడిచే లోగా, ఫతిక్ తల్లి ఆ గదిలోకి సుడిగాలిలా దూసుకువచ్చింది. గుండెలు బాదుకొంటూ కిందామీదా పొర్లుతూ,బిగ్గరగా ఏడవసాగింది. విశ్వంభర ఆమెను ఓదార్చడానికి ప్రయత్నించాడు. ఆమె అతనిని విదిలించి, మంచం మీదకు వెళ్లి కూర్చుంది,"ఫతిక్, నా చిట్టి తండ్రీ, నా బుజ్జి తండ్రీ.."

ఫతిక్ తన అనిశ్చిత కదలికలను ఓ క్షణం ఆపాడు. అతని చేయిని పైకి కిందికి ఊపడానికి ప్రయత్నించాడు. అతిప్రయాసతో అన్నాడు, "ఎవ...?"

అమ్మ మళ్ళీ ఏడ్చింది. "ఫతిక్, నా చిట్టి తండ్రీ, నా బుజ్జి తండ్రీ.."

ఫతిక్ మెల్లిగా తల తిప్పి,ఎవరి వంకా చూడకుండా అన్నాడు,"అమ్మా, సెలవలొచ్చాయి!"

★

**అనుసృజకుల వ్యాఖ్యానం**

కన్నతల్లి, కన్నఊరు స్వర్గంతో సమానం అంటారు కదా.అచ్చంగా అలాగే, నది ఒడ్డున పల్లెలో తమ తల్లికొంగు మాటున సహజంగా ఎదుగుతున్న ఓ చలాకీ పిల్లవాడు,రణగొణధ్వనులతో క్రిక్కిరిసిన కలకత్తా నగరపు ఇరుకుసందుల మురికి వీధుల్లోకి వచ్చి తడబడి నపుడు,ఆ నగర సంస్కృతిలోని కొత్త వాతావరణ పరిస్థితుల్లోకి ఇమడగలగాలంటే, తన వారి ఆత్మీయ భావనలే కదా ఆధారం, అండదండా.

ఒక అబ్బాయి కన్నవారికి, పుట్టిపెరిగిన ఇల్లు, ఊరు, ఏరు... అన్నిటికీ దూరంగా వెళ్ళవలసి వచ్చిన అనివార్య పరిస్థితులు,వాటి పర్యవసానాల కథ ఇది. కిశోరవయస్కుడైన ఆ పద్నాలుగేళ్ళ పిల్లవాడు కన్నతల్లి ప్రేమ కోసం పరితపించే సందర్భం ఎదురవ్వడం ఎంత విషాదం. అపనమ్మకం, వివక్ష, నిరాదరణ, ఎడబాటు, ఇంటిబెంగ... వీటన్నిటికి తోడైన ఒంటరితనం; అయినవారే పరాయివారయిన సందర్భం.

తెలిసీతెలియని కౌమార వయస్సులోని పిల్లల పెంపకం ఎలా ఉండాలో, ఎలా ఉండకూడదో... సున్నితంగా, కరుణార్ద్రంగా చెప్పిన ఈ కథ, పిల్లల పెంపకంలో అవగాహన కరువయిన ఒక ఒంటరితల్లి నిస్సహాయ వేదన. గుండెకోత.

ఈ కథ అన్నాతమ్ముళ్ళు అన్నాచెల్లెళ్ళ నడుమ సంబంధ బాంధవ్యాల కథ.వారికి సమాంతరంగా ఎదుగుతోన్న తోబుట్టువుల పిల్లలు, సమవయస్కుల సంబంధాల చిత్రణ కూడా.

"జీవరాశులన్నిటిలోనూ కనబడే ఆ భౌతిక ప్రేమ, ప్రేమించే వారికి దగ్గరగా ఉండాలన్న ఆ సహజవాంఛ, అవ్యక్తమైన అనుభూతులన్నీ మూటగట్టుకొన్న దూరపు ఎడబాటు దుఃఖం,అమ్మ కోసం లోలోపల గూడు కట్టుకొన్న నిశ్శబ్దశోకం. అదంతా అచ్చంగా సంధ్యవేళలో కన్నతల్లి డొక్కలో దూరే లేగదూడ లాంటి ప్రేమ, ఒక జీవస్పృహ.ఆ ప్రేమ అలజడిగా,సిగ్గుగా,వణుకుగా... ఆ బక్కపలచని, బట్టలైనా సరిగ్గా లేని అనాకారి పిల్లవాడి గుండెలనిండా నిండి ఉంది.ఎవరికీ అర్థం కాలేదు కానీ, అతని మనసును ఎరవేసినది అతని కన్నతల్లి ఎడబాటు దుఃఖమే."అని అంటారు టాగోర్.

ఫతిక్ చక్రవర్తి టాగోర్ కలం అంచున జాలువారిన ఓ కన్నీటిచుక్క.

COMMENTS